క్లుప్తంగా

నేడు యోగా పోటీలు

నల్లగొండ టూటౌన్ : స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం జిల్లా యోగా అసోసియేషన్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యోగా పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కుంభం నర్సిరెడ్డి, కార్యదర్శి నంద్యాల రాజశేఖర్‌రెడ్డిలు ఒక ప్రకటనలో తెలిపారు. యోగా పోటీల్లో పాల్గొనే వారు పూర్తి వివరాలకు యోగా కోచ్ నాగార్జున నంబర్ 9052535054 సంప్రదించాలని తెలిపారు.

ఎంజీయూలో జాతీయ అంతరిక్ష దినోత్సవం

నల్లగొండ టూటౌన్: మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం ఎన్‌సీసీ, ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో శనివారం జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోస్టర్ ప్రజెంటేషన్, గ్రూప్ డిస్కషన్, ఆర్ట్ ప్రదర్శన తదితర అంశాలను ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్. సుధారాణి వివరించారు. అంతరిక్ష పరిశోధనలో భారతదేశం అగ్రరాజ్యాల సరసన నిలవడం అందరికీ గర్వకారణమన్నారు. ఈ రంగంలో పరిశోధనలకు అనేక అవకాశాలు ఉన్నందున యువ శాస్త్రవేత్తలుగా ఎదిగే అవకాశాన్ని చేజిక్కించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్, రిజిస్ట్రార్ అల్వాల రవి, లక్ష్మారెడ్డి, మాధవరావు, జి. మచ్చేందర్ పాల్గొన్నారు.

అంతరిక్ష పరిశోధనాసక్తి పెంపొందించాలి

నకిరేకల్ : విద్యార్థుల్లో అంతరిక్ష పరిశోధనాస్తకి పెంపొందించాలని నకిరేకల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బెల్లి యాదయ్య సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫిజిక్స్ విభాగంలో శనివారం జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా అంతరిక్ష పరిశోధనలపై వ్యాసరచన పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులను ఆయన అందజేసి మాట్లాడారు. అంతరిక్ష పరిశోధనలు దేశం మేధాశక్తికి ప్రతీకలన్నారు. విద్యార్థులు తమలోని విజ్ఞా స్పృహను అంతరిక్షం వైపు మళ్లిస్తే దేశం మరింత శాస్త్ర సంకేతికాబివృద్ధిని సాధించగలదన్నారు. ఫిజిక్స్ విభాగాధిపతి జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమంలో అధ్యాపకులు నాగు, ప్రవీన్‌రెడ్డి, శ్రీనివాసాచారి, హరిత, మధుసూధన్‌రెడ్డి, శంకర్, నర్సింహాచారి, శివశంకర్, రవీందర్, సుభాషిణి, పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్, ఇంజనీరింగ్ శానిటరీ కమిటీ ఎన్నిక

నకిరేకల్ : నకిరేకల్ పట్టణ ఎలక్ట్రికల్, ఇంజనీరింగ్, శానిటరీ నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా శ్రీరంగం వెంకటరంగయ్య, ఉపాధ్యక్షులుగా గుర్రం రమేష్, మహ్మమ్మద్ అజీమ్, షేక్ వాజీద్, శాశ్వత గౌరవ అధ్యక్షుడిగా బుద్దె వేంకటేశ్వరరావు, వరకాతం నారయణరెడ్డి, గౌరవ సలహాదారులుగా వీరవెల్లి రఘునాథ్, కోశాధికారిగా గుండా శ్రీకాంత్, కార్యదర్శిగా భూపతి నరేష్, కార్యవర్గసభ్యులు ఎన్నికయ్యారు.

రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే యూరియా కొరత

కట్టంగూర్ : రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే యూరియా కొరత ఏర్పడిందని బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యదర్శి గోలి మధుసూధన్ రెడ్డి అన్నారు. శనివారం కట్టంగూర్‌లో వివిధ ఎరువుల దుకాణాలను ఆయన సందర్శించి మాట్లాడారు. పదేళ్లుగా లేని కొరత ప్రస్తుతం ఎందుకొచ్చిందో కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. కేంద్ర ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం కాంగ్రెస్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య, భవనం మధుసూదన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు నాగరాజు, వెంకట్‌రెడ్డి, ఉన్నారు.

హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

శాలిగౌరారం : ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందని బీజేపీ కిసాన్‌మోర్చా జాతీయ నాయకులు గోలి మధుసూధన్‌రెడ్డి అన్నారు. ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై మండలకేంద్రంలో శనివారం బీజేపీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐ కి వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో ఆపార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కడియం రామచంద్రయ్య, భవన మధుసూదన్‌రెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్ జమ్ము రమేష్, మండలఅధ్యక్షుడు తోట వినోద్, నాయకులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

నకిరేకల్: ఇంట్లో తగాదాలతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగిన వివాహిత ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం శనివారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్ మండలం మర్రూరు గ్రామానికి చెందిన షేక్ మదార్, అస్సినా(26) భార్యాభర్తలు. ఇంట్లో తగాదాలతో మనస్తాపం చెందిన అస్సినా ఈ నెల 21న పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి ఆమెను నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతురాలి భర్త షేక్ మదార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ లచ్చిరెడ్డి తెలిపారు.

భారీగా తగ్గిన వరిసాగు

- మునుగోడు డివిజన్‌లో పడిపోయిన భూగర్భ జలాలు
- పశుగ్రాసం కొరత ఏర్పడుతుందని రైతుల ఆవేదన


మునుగోడులో వరి నాటు వేస్తున్న కూలీలు

మునుగోడు : ఎలాంటి సాగునీటి వనరులు లేని మునుగోడు నియోజకవర్గంలో కేవలం భూగర్భ జలాలపై ఆధారపడే రైతులు వరి సాగు చేస్తారు. అయితే చెరువులు, కుంటల్లో నీరు నిల్వ లేక భూగర్భ జలాలు తగ్గిపోయాయి. దీంతో ఈ సీజన్‌లో వరిసాగు భారీగా తగ్గింది.

ఇప్పటి నియోజకవర్గం వ్యాప్తంగా కేవలం 10,963 ఎకరాల్లోనే వరిసాగు చేయగా.. మరి కొంత మంది రైతులు అడపాదడపా పడుతున్న వర్షాలకు పొలాలు దున్ని నాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు.

గతేడాది 20,741 ఎకరాల్లో వరి సాగు

మునుగోడు వ్యవసాయం డివిజన్‌లో ఉన్న ఐదు మండలాల్లో దాదాపు 2.70 లక్షల ఎకరాల సాగుభూమి ఉంది. ఇక్కడ ఇరైతులు పత్తి, వరి పంటలను అధికంగా సాగు చేస్తుంటారు. గత ఏడాది వానాకాలంలో డివిజన్ వ్యాప్తంగా 1,53,230 ఎకరాలల్లో పత్తి, 20,741 ఎకరాల్లో వరి సాగు చేశారు. కానీ ఈ ఏడాది ఇప్పటి వరకు పత్తి 1,56,104 ఎకరాల్లో సాగు చేయగా.. వరి 10,963 ఎకరాల్లో మాత్రమే వేశారు. అంటే ఈ ఏడాది 10,207 ఎకరాల్లో వరినాట్లు వేయలేదు.

గత, ప్రస్తుత వానాకాలంలో వరిసాగు వివరాలు (ఎకరాల్లో)ఇలా

మండలం	2024	2025
మునుగోడు	6802	4485
చండూరు	4908	2550
మర్రిగూడ	4346	1900
నాంపల్లి	3262	1595
గట్టుప్పల్	1422	433
మొత్తం	20,741	10,963

సాగు విస్తీర్ణం తగ్గడానికి కారణాలు ఇవీ..

గ్రామాల్లోని చెరువులు, కుంటల్లో నీరు నిల్వ లేక భూగర్భ జలాలు పడిపోయాయి. గతంలో వర్షాకాలం ప్రారంభంలో పారే మునుగోడు పెద్ద వాగు ఇప్పటికి వరకు ఒక్కసారి కూడా పారలేదు. దీంతో ఆ వాగు ఆనుకొని ఉన్న దాదాపు 10 గ్రామాల్లోని బోర్లు పూర్తిగా ఎండిపోయి నీటి వసతి లేక రైతులు వరిసాగు తగ్గించారు. వరిసాగు తగ్గడంతో ఈ ఏడాది మూగ జీవులకు పశుగ్రాసం కొరత కూడా తీవ్రంగా ఉంటుందని రైతులు వాపోతున్నారు.

భూగర్భ జలాలు పడిపోయాయి



ఈ వానాకాలంలో వరి పంట సాగు భారీగా తగ్గింది. అందుకు ప్రధాన కారణం భూగర్భ జలాలు పడిపోవడమే. గతేడాది వానాకాలంలో డివిజన్ వ్యాప్తంగా 20,741 ఎకరాల్లో వరి పంట సాగైంది. ఈ ఏడాది ఇప్పటి వరకు కేవలం 10,963 ఎకరాల్లో మాత్రమే సాగైంది. పత్తి పంట మాత్రం ఏ మాత్రం తగ్గలేదు. గతంలో కంటే మరో మూడు వేల ఎకరాల్లో అదనంగా సాగుచేశారు.

– బి.వేణుగోపాల్, మునుగోడు డివిజన్ వ్యవసాయ అధికారి

మూడెకరాల్లోనే వరి సాగు చేశా



నాకు మొత్తం పదెకరాల భూమి ఉంటే ఏటా ఆరు ఎకరాలకుపైగా వరి సాగు చేసేవాడిని. కానీ ఈ ఏడాది వర్షాలు కురవకపోవడంతో బోర్లలో నీరు తగ్గింది. దీంతో కేవలం మూడెకరాల్లో మాత్రమే వరి పంట సాగు చేశాను.

– తాటికొండ సైదులు, రైతు చీకటిమామిడి

ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి

- డీఎస్పీ శివరాంరెడ్డి


శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండ: గణేశ్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని నల్లగొండ డీఎస్పీ శివరాం రెడ్డి అన్నారు. ఆయన శనివారం నల్లగొండలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శాంతి సంఘం సభ్యులు, ఉత్సవ నిర్వాహకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గణేశ్ విగ్రహాల ఏర్పాటు వివరాలను విధిగా ఆన్‌లైన్ చేయాలని, మండపం వద్ద మైక్ సెట్ సౌండ్‌తో ఇబ్బంది పెట్టొద్దని సూచించారు. మండపాలను రోడ్డు మధ్యలో కాకుండా కాలనీలలోని ఖాళీ ప్రదేశంలో పెట్టుకోవాలన్నారు. మండపాన్ని మూసేందు ముందు ప్రతి రాత్రి విగ్రహం వద్ద వెలిగించి ఉన్న నూనె దీపాల విషయంలో నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని లేకపోతే దీపం కిందపడి అగ్ని ప్రమాదం జరుగుతుందని గమనించాలన్నారు. మండప నిర్వాహకులు ప్రతి రోజూ మండపాన్ని సోదా చేసి అవసరమైతే పోలీసులకు తెలుపాలని సూచించారు. మండపం వద్ద కార్యక్రమాలు రాత్రి 10గంటల్లోగా పూర్తిచేయాలన్నారు. సమావేశంలో నల్లగొండ ఆర్డీఓ అశోక్‌రెడ్డి, వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, టూ టౌన్ సీఐ రాఘవరావు, పోలీసు సిబ్బంది మహా లక్ష్మయ్య, గోపాలరావు, సైదులు, పాల్గొన్నారు.

కనగల్ : గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని చండూరు సీఐ ఆదిరెడ్డి అన్నారు. శనివారం కనగల్ పోలీస్ స్టేషన్‌లో ఉత్సవ కమిటీ సభ్యులకు, మైనార్టీ నాయకులకు, మాజీ సర్పంచ్‌లకు సమీక్ష సమావేశాన్ని నిర్వహించిన సందర్భంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ కె. రాజీవ్‌రెడ్డి విద్యుత్ ఏఈ కుమార్ పాల్గొన్నారు.

మర్రిగూడ : మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో గణేశ్ నవరాత్రి ఉత్సవాలకు తప్పనిసరిగా పోలీసు శాఖ అనుతులు తీసుకోవాలని సీఐ డి.రాజు అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని 18 గ్రామపంచాయతీలకు సంబంధించిన గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులతో నిర్వహించిన పీస్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నిబంధనలను పాటించని నిర్వాహకులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

త్వరలో వంద పడకల ఆస్పత్రి ప్రారంభం

- భువనగిరి ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి


నకిరేకల్ : ఏరియా ఆస్పత్రిలో ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

నకిరేకల్ : నకిరేకల్‌లో నిర్మాణంలో ఉన్న వంద పడకల వైద్యశాలను త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తామని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి అన్నారు. నకిరేకల్‌లోని ఏరియా ఆస్పత్రిలో పేషెంట్ల కోసం నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ను శనివారం స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశంతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఎస్ డాక్టర్ మాత్రు నాయక్, మార్కెట్, మున్సిపల్ చైర్‌పర్సన్లు గుత్తా మంజుల మాధవరెడ్డి, చౌగోని రజితాశ్రీనివాస్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వరరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శోభారాణి మున్సిపల్ మేనేజర్ అబ్దుల్ రషీద్, మున్సిపల్ ఎఈ గౌతం, కౌన్సిలర్లు గాజుల సుకన్య, పోతుల సునీత పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించడమే లక్ష్యం

కట్టంగూర్ : ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తన నిధులు రూ.2లక్షలతో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ(నీటిశుద్ధి కేంద్రం)ప్లాంట్‌ను ఆయన స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశంతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. ఆశ వర్కర్లు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎంపీకి వినతి పత్రం అందజేశారు. అదే విధంగా మండలకేంద్రంలో జాతీయ రహదారిపై అదనపు అండర్ పాసింగ్ బ్రిడ్జి నిర్మించాలని కోరుతూ గ్రామస్తులు ఎంపీకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ లోకసాని వేణుగోపాల్‌రెడ్డి, మండల ప్రత్యేక అధికారి సతీష్, తహసీల్దార్ యాదగిరి, ఎంపీడీఓ జ్ఞానప్రకాశ్‌రావు, పీహెచ్‌సీ వైద్యాధికారి శ్వేత, మాజీ జెడ్పీటీసీలు ఉన్నారు.

నార్కట్‌పల్లి : బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేయలేని పనులను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే చేసి చూపిస్తుందని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నార్కట్‌పల్లి పట్టణ కేంద్రంలోని కూరగాయాల అంగడి నుంచి మాండ్ర వరకు రోడ్డు భవనల శాఖ మంత్రి నిధులు రూ.14 కోట్లతో రోడ్డు విస్తరణ పనులకు వారు శంకుస్థాపన చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఐతరాజు యాదయ్య, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ ఉమేశ్, డాక్టర్ విజయ్‌కుమార్, బత్తుల ఉషయ్య పాల్గొన్నారు.

ప్రపంచంతో పోటీ పడి చదవాలి

రామగిరి(నల్లగొండ) : నడుస్తున్న పోటీ ప్రపంచంతో పోటీపడి చదవాలని నాగార్జున ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ అన్నారు. శనివారం ఎంవీఆర్. ప్రసాద్, ఎం. ఏ భవాని మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బీఎస్సీ ఫిజిక్స్ సబ్జెక్టులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతి, బంగారు పతకాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా బంగారు పతకాలను, నగదు బహుమతిని అందజేస్తున్న ట్రస్ట్ స్థాపకులు వెంకటేశ్వరరావు, సుబ్రహ్మణ్య కుమార్, పద్మజల సౌజన్యానికి అభినందనలు తెలి పారు. గడిచిన విద్యా సంవత్సరం బీఎస్సీ భౌతి కశాస్త్రంలో టాపర్‌గా నిలిచిన శిరీషకు ఐఐటీ చదవడానికి అయ్యే ఖర్చు తానే భరిస్తానని ప్రిన్సిపాల్ ప్రకటించారు. ఈ విద్యార్థికి ఐఐటీలో సీటు వస్తే తలా రూ.5వేలు ఇస్తామని భౌతికశాస్త్రం విభాగ అధిపతి డాక్టర్ ఎం. శ్రీనివాస్ రెడ్డి, గణితశాస్త్ర విభాగం అధిపతి వెంకట్ రెడ్డి ప్రకటించారు. అనంతరం అమెరికా నుంచి ట్రస్ట్ వ్యవస్థాపకుల్లో ఒకరైన సుబ్రహ్మణ్య కుమార్ సెల్ ఫోన్ లో పంపిన సందేశాన్ని వినిపించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఎస్. శేఖర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో భూనిర్వాసితుడు మృతి


జితేందర్‌రెడ్డి (ఫైల్)

మర్రిగూడ : మండలంలోని శివన్నగూడ రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతున్న నర్సిరెడ్డిగూడెం ముంపు గ్రామస్తుడు భూనిర్వాసితుడు మారుపాకుల జితేందర్‌రెడ్డి (51) అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతిచెందాడు. కుటుంబసభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా జితేందర్‌రెడ్డి పొలం రిజర్వాయర్ నిర్మాణానికి అవసరం కాగా 2017లో తమకు కాళేశ్వరం తరహాలో పరిహారం అందించాలని గ్రామస్తులతో కలిసి ధర్నా నిర్వహించారు. అదే క్రమంలో పోలీసులు కేసులు పెట్టి దాడి చేయడంతో జితేందర్‌రెడ్డి పక్కటెముకలు విరిగి తీవ్రంగా గాయపడ్డాడని వాపోయారు. అప్పటి నుంచి ఆరోగ్యం మరింత క్షీణించి మృతిచెందినట్లు వాపోయారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని నిర్వాసితులు కోరుతున్నారు.

నకిలీ డీఓటీ వెరిఫికేషన్‌పై జాగ్రత్త అవసరం


కరాటే మాస్టర్ గణేశ్‌కు అవార్డు అందజేస్తున్న ఎస్పీ శరత్ చంద్రపవార్

నల్లగొండ : నకిలీ డీఓటీ వెరిఫికేషన్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలని ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంకు ఎగ్జిక్యూటివ్‌గా నటిస్తూ, ప్రీమియం సర్వీసులు కలిగిన క్రెడిట్ కార్డులు మంజూరు చేస్తామని చెప్పి మోసగాళ్లు ప్రస్తుతం కొత్త మోడో ఆపరెండ్ ఉపయోగిస్తున్నారని ఈ విషయం ప్రజలు గమనించాలని తెలిపారు. డీఓటీ సిమ్ వెరిఫికేషన్ పేరుతో బాధితులకు నకిలీ బ్యాంకు స్టిక్కర్లు ఉన్న ముందే కాన్ఫిగర్ చేసిన మొబైల్ ఫోన్లను కొరియర్ చేస్తూ సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారన్నారు. ఇలాంటి వాటిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఇలాంటి సమాచారం తెలిస్తే సమాచారం ఇవ్వాలన్నారు.

ఆత్మరక్షణకు కరాటే..

నార్కట్‌పల్లి : ఆత్మరక్షణకు ప్రతి ఒక్కరికి కరాటే అవసరమని ఆడ, మగ తేడా లేకుండా అందదరూ కరాటే నేర్చుకోవచ్చని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు. శనివారం మహిళా పోలీసులకు కరాటే శిక్షణ నేర్పించిన నార్కట్‌పల్లికి చెందిన కరాటే మాస్టర్ గణేశ్‌కు అవార్డు అందజేసి మాట్లాడారు.అనంతరం కరాటే మాస్టర్ గణేష్‌ను ఎస్పీ అభినందించారు.

దైవభక్తితో మానసిక ప్రశాంతత


ఎడ్లబండ్లపై ప్రభల ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే మందుల సామేల్

శాలిగౌరారం : దైవభక్తి ప్రతి ఒక్కరిలో మానసిక ప్రశాంతత కలుగుతుందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మండలంలోని పెర్కకొండారం గ్రామంలో పురాతన అప్పల ఆంజనేయ స్వామి దేవాలయ పండుగ శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆంజనేయస్వామి ప్రభలతో కూడిన ఎడ్లబండ్ల ప్రదర్శనలో ఎమ్మెల్యే పాల్గొని ఎడ్లబండిపై గ్రామవీరులోని దేవాలయం వద్దకు ర్యాలీగా వెళ్లారు. వచ్చే పండుగనాటికి లింక్‌రోడ్డును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తానన్నారు. ఆయన వెంట పీఏసీఎస్ మాజీ ఉపాధ్యక్షుడు నూక కిరణ్‌యాదవ్, డీసీసీ ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, యూత్‌కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొల్లికొండ గణేశ్, స్థానిక నాయకులు మంగదుడ్ల శ్రీను, లోకసాని రంగారెడ్డి, నూక కిశోర్, పల్స సైదులు, నూక భద్రయ్య, బిక్షంరెడ్డి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్జీ కళాశాలలో మెగా రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న విద్యార్థులు

రామగిరి(నల్లగొండ): విశ్వబంధుత్వ దినోత్సవం సందర్భంగా నల్లగొండ ఎన్జీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్స్, సోషల్ సర్వీస్ వింగ్ బ్రహ్మకుమారిస్ రెడ్ క్రాస్ సొసైటీ సంయుక్తంగా శనివారం మెగా రక్తదానం శిబిరాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాలు ఉపేందర్ అధ్యక్షతన నిర్వహించారు. రక్తదాన శిబిరంలో ముఖ్యఅతిథిగా లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఆర్ మదన్‌మోహన్, మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.మద్దిలేటి పాల్గొన్నారు. ఈ శిబిరంలో ఎన్ఎస్ఆర్ ఎన్ఎస్ఎస్ వలంటీర్స్, విద్యార్థులు ఇతరులు 60 బ్లడ్ యూనిట్ల రక్తాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బహ్మకుమారి ఈశ్వరియ నల్గొండ ఇన్‌చార్జ్ ధనలక్ష్మి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ నల్గొండ డాక్టర్ పుల్లారావు, సైదిరెడ్డి, బ్రహ్మకుమారి సభ్యులు, ఎన్ఎస్ఎస్ యూనిట్స్ అధికారులు నర్సింగ్ కోటయ్య, ఎం వెంకటరెడ్డి, డాక్టర్ బొజ్జ అనిల్ కుమార్, డాక్టర్ ఏ. మల్లేశం, ఎం. సావిత్రి , సిబ్బంది , ఎన్ఎస్ఎస్ వలంటీర్స్ పాల్గొన్నారు.

లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా ఉచిత న్యాయ సాయం


మాట్లాడుతున్న జడ్జి మంజుల సూర్యావర్

శాలిగౌరారం : వయోవృద్ధులు లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా ఉచిత న్యాయ సాయం పొందవచ్చని నకిరేకల్ సెషన్స్‌కోర్టు సీనియర్ సివిల్ జడ్జి మంజులసూర్యావర్ అన్నారు. ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా మండలంలోని వల్లాల గ్రామంలో నకిరేకల్ మండల న్యాయసేవా కమిటీ ఆధ్వర్యంలో శనివారం చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జడ్జి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వయోవృద్ధులు న్యాయ సాయం పొందేందుకు చట్టంలో ఉన్న హక్కులు, హక్కుల వినియోగం తదితర అంశాలపై ప్రజలకు, వృద్ధులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి, ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి, ఎంఈఓ సైదులు, మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, కృష్ణారెడ్డి, న్యాయవాదులు ప్యామ్‌రామ్, గోవిందరాజులు, యాదగిరి, ఓంకార్, నాగరాజు, ఉదయ్, వెంకన్న, పారాలీగల్ వలంటీర్లు ఉపేందర్, వెంకటేశ్వర్లు, జయరాం, మాజీసర్పంచ్ షేక్ ఇంతియాజ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఇబ్బందులు


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే లింగయ్య

నార్కట్‌పల్లి : కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర ప్రజలు రోజు రోజుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలోని తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్నా ప్రస్తుత ప్రభుత్వం మాత్రం చేతులు ముడుచుకు కూర్చిందని ఎద్దేవా చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటంలో అప్పటి కేసీఆర్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇచ్చిందని తెలిపారు. వైద్యారోగ్య శాఖ మంత్రి పేపర్లు, టీవీల్లో ప్రకటనలకే పాధాన్యమిస్తున్నారు తప్ప ఒక్క ఆస్పత్రిని కూడా సందర్శించిన దాఖలాలు లేవని తెలిపారు. ఆయన వెంట పట్టణ అధ్యక్షుడు దోసపాటి విష్ణుమూర్తి, చిరుమర్తి యాదయ్య, యాణాల అశోక్‌రెడ్డి, కొండురు శంకర్, దుబ్బాక శ్రీదర్, కర్నాటి ఉపేందర్, మల్లేబోయిన సైదులు, పుల్లెంల వెంకట్ పాల్గొన్నారు.

సురవరం సుధాకర్‌రెడ్డికి నివాళి


నల్లగొండ టూ టౌన్ : సీపీఐ జిల్లా కార్యాలయంలో సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆ పార్టీ నాయకులు


మునుగోడు : సుధాకర్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు


చిట్యాల: గుండ్రాంపల్లిలో..

సంక్షిప్త సమాచారం

◆ ఇంకుడు గుంతలతో పరిశుభ్రత

రామగిరి(నల్లగొండ): ఇంకుడు గుంతలతో పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయని ఎంపీడీఓ యాకుబ్‌నాయక్ అన్నారు. మండలంలోని పెద్ద సూరారం గ్రామంలో శనివారం ఇంకుడు గుంతల నిర్మాణాలకు స్థలాన్ని సిబ్బందితో కలిసి పరిశీలించారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఇప్పటి వరకు మండలంలో 640 ఇళ్లు పురోగతిలో ఉన్నాయన్నారు.

◆ ధర్నాకు అనుమతి ఇవ్వాలని వినతి

నకిరేకల్ : హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే ధర్నాకు వెళ్లేందుకు అనుమతించాలని కోరుతూ ఆశల సంఘం జిల్లా అధ్యక్షరాలు సింగం రేణుక శనివారం డీఎంహెచ్‌ఓ కార్యాలయం సూపరింటెండెంట్ మహ్మద్ అలీకి వినతిపత్రం అందజేశారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. వినతి పత్రం అందజేసిన వారిలో బీఆర్‌ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిలివేరు ప్రబాకర్, ఆశ జిల్లా సంఘం ప్రతినిధులు ఉన్నారు.

◆ కూలి రేట్లు పెంచాలని..

నకిరేకల్ : చేనేత కార్మికులకు వస్త్ర, నేత విషయంలో మీటర్‌కు రూ36 ప్రభుత్వం ఇస్తున్నందున కూలి రేట్లు రూ.70కి పెంచాలని కోరుతూ శనివారం చేనేత, జౌళి శాఖ కమిషనర్‌కు శైలజరామయ్యకు నకిరేకల్ చేనేత సహకార సంఘం పర్సన్ ఇన్‌చార్జ్ చిలుకూరి లక్ష్మీనర్సయ్య వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆమె సానుకులంగా స్పందించి ప్రభుత్వానికి లేఖ రాస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

◆ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

నల్లగొండ టూటౌన్: మాడుగుపల్లి మండలం కన్నెకల్‌లో పోస్టాఫీస్ ఎదుట, బస్టాండ్ సెంటర్‌లో, ప్రభుత్వ జిల్లా ఉన్నత పాఠశాల దగ్గర ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి అక్రమంగా దుకాణాలు ఏర్పాటు చేసిన వాటిపి తొలగించి వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామస్తులు శనివారం కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం అందజేశారు.

◆ మహిళా సంఘాల బలోపేతమే లక్ష్యం

తిప్పర్తి : మహిళా సంఘాల బలోపేతమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని మండల సమాఖ్య అధ్యక్షురాలు సునిత అన్నారు. ఆమె శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఏపీఎం హరి, కా ర్యదర్శి హజీమా, తండు రాణి, సీసీలు, జ్యోతి, జా నకమ్మ, రస్తినిధి అసిస్టెంట్ మేనేజర్ పాల్గొన్నారు.

◆ ఎఫ్‌సీఐలో ఉచిత వైద్యశిబిరం

నల్లగొండ : భారత ఆహార సంస్థ కార్యాలయంలో ఎఫ్‌సీఐ ఉద్యోగులకు శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం కేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. అనంతరం సిబ్బందికి వైద్యులు వివిధ రకాల పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు నవీన్, భారత ఆహార సంస్థ సీనియర్ అధికారి ప్రసాద్, వైద్యురాలు సుష్మ, మార్కెటింగ్ టీమ్ ఉద్యోగి నగేష్, పాల్గొన్నారు.

◆ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

నకిరేకల్ : జిల్లా కేంద్రంలోని అభినవ్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి 10 జూనియర్ అథ్లెటిక్స్ మీట్ (అండర్ -16) 600 మీటర్ల రన్నింగ్ విభాగంలో నకిరేకల్‌లోని న్యూవిజన్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని మామిడి మధుప్రియ జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికై ందని ఆపాఠశాల ప్రిన్సిపాల్ బి.అశోక్‌కుమార్ శనివారం తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన మధు ప్రియను సత్కరించి అభినందించారు.

◆ ఆర్థిక సాయం అందజేత

నకిరేకల్ : మండలంలోని టీకుల గూడెంలో నిరుపేద కుటుంబానికి చెందిన పన్నాల శివరెడ్డి (25)అనారోగ్యంతో మృతి చెందారు. శనివారం ఆయన మృతదేహన్ని టీపీసీసీ ప్రదానకార్యదర్శి దైద రవీందర్ పూలమాల వేసి వారి కుటుంబీకులకు తక్షణం రూ.10 వేలు ఆర్థిక సాయంగా అందజేశారు.

◆ అక్రమ కట్టడాలు తొలగించాలి

నార్కట్‌పల్లి: స్థానిక కూరగాయల అంగడి స్థలంలో ఉన్న అక్రమ కట్టడాలను తొలగించాలని కోరుతూ శనివారం నార్కట్‌పల్లికి వచ్చిన ఎస్పీ శరత్ చంద్ర పవార్‌ను బీజేపీ నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో మేడబోయిన శ్రీనివాస్, జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు మునుకుంట్ల గణేష్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు నోముల నాగరాజు, నాయకులు ఉన్నారు.

◆ గ్రంథాలయ సామగ్రి బహూకరణ

నార్కట్‌పల్లి: మండలంలోని అక్కెనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2015–2016 బ్యాచ్ పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు తన మిత్రురాలు పనసం స్వాతి జ్ఞాపకార్థం రూ. 4 వేలు విలువ గల గ్రంథాలయ సామగ్రిని ఎస్‌ఐ క్రాంతికుమార్ పూర్వ విద్యార్థులతో కలిసి పాఠశాలకు బహూకరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

◆ ఉపాధి హామీ పనుల్లో తేడాలు ఉండొద్దు

తిప్పర్తి : ఉపాధి హామీ పథకంలో భాగంగా పనులపై ఎలాంటి ఫిర్యాదులు లేకుండా చూడాలని ఏపీడీ నవీన్ కుమార్ అన్నారు. ఆయన శనివారం మండలపరిషత్ కార్యాలయంలో 14వ విడత ఉపాధి హామీ పనులపై నిర్వహించిన సామాజిక తనిఖీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి వేణుగోపాల్‌రావు, అంబుడ్స్‌మెన్ మమూద్‌గోరి, ఎంపీడీఓ సుధాకర్, ఏపీఓ శిరీష, ఈసి జుల్వేకర్, ఎస్ఆర్‌పీ పాల్గొన్నారు.

◆ యూరియా కొరత లేకుండా చూడాలి

నకిరేకల్ : యూరియాలో బ్లాక్ మార్కెట్లో అరికట్టి కొరత లేకుండా రైతులకు సరిపడా అందించాలని కోరుతూ నకిరేకల్‌లో ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి అంబటి చిరంజీవి, జిల్లా నాయకులు గజ్జి రవిలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, వెంకన్న, పిట్టల అనిల్, నర్సింహ్మ, సాయినాథ్ పాల్గొన్నారు.

◆ మహేశ్ కుటుంబానికి పరామర్శ

శాలిగౌరారం : ఆర్థిక ఇబ్బందులతో ఇటీవల రైలుకిందపడి ఆత్మహత్యకు పాల్పడిన మండలకేంద్రానికి చెందిన కబడ్డీ క్రీడాకారుడు బండారు మహేశ్ కుటుంబాన్ని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ శనివారం పరామర్శించారు. మహేశ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం రూ.10వేల ఆర్థిక సాయం అందించారు.

◆ వ్యాపారస్తుల రాస్తారోకో

శాలిగౌరారం : మార్వాడీలకు వ్యతిరేకంగా మండల కేంద్రంలోని శాలిగౌరారం–నకిరేకల్ ప్రధాన రోడ్డుపై స్థానిక వ్యాపారులు శనివారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వ్యాపారస్తులు మాట్లాడుతూ ఈ పోరాటంలో ప్రజాసంఘాలు, ప్రజలు భాగస్వాములు కావాలన్నారు.